క్లుప్తంగా

ఆరేటి ఉదయ్‌కు సత్కారం



ఉదయ్‌ను సత్కరిస్తున్న దృశ్యం

పాలకోడేరు: లండన్ డిప్యూటీ మేయరుగా ఎన్నికైన తుందుర్రు గ్రామానికి చెందిన ఆరేటి ఆర్యన్ ఉదయ్‌ను మండలంలోని పెన్నాడలో ఉన్న భీమవరం ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ అడబాల వెంకటేశ్వర రావు మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి అత్యంత అభివృద్ధి చెందిన లండన్ లాంటి నగరానికి డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన ఉదయ్ ని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ టీవీవీ ప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ కొప్పర్తి సురేష్, గన్నాబత్తుల శ్రీనివాస్, ఆరేటి ప్రకాష్, పుప్పాల శేషు పాల్గొన్నారు.

మావుళ్లమ్మ సేవలో ఆరేటి ఉదయ్

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలోని మావుళ్లమ్మను సెంట్రల్ లండన్‌లోని రాయల్ బరో అఫ్ కెన్సింగ్టన్ అండ్ చెల్సియా నగరానికి డిప్యూటీ మేయర్‌గా ఎన్నికైన ఆరేటి ఆర్యన్ ఉదయ్ అమ్మవారిని శుక్రవారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అర్చకులు పూజలు, ఆశీర్వచనాలు అందజేశారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ శేషవస్త్రం ప్రసాదం ఫోటో అందజేశారు.

పీఎం సూర్యఘర్ పథకంపై అవగాహన

భీమవరం (ప్రకాశంచౌక్): మెప్మా సిబ్బందికి, మెప్మా ఆర్పీలకు పీఎం సూర్యఘర్ పథకంపై శుక్రవారం భీమవరంలో అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పీఎం సూర్యఘర్ పథకంలో ఏవిధంగా నమోదు చేయాలో, సబ్సిడీ, బ్యాంకు లోన్ గురించిన విషయాలు ఆ పథకం వల్ల కలిగే లాభాలు గురించి ఎల్విన్ సంస్థ ప్రతినిధులు వివరించారు. ఈ సందర్భంగా మెప్మా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ జి.హెప్సిబా మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకం గురించి అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో టెక్నికల్ ఎక్స్ పర్ట్ సీ.హెచ్. నానీబాబు, ఐబీ సిహెచ్.మోహనరావు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో పర్యావరణ పరిరక్షణ



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పాలకోడేరు: ప్రకృతి వ్యవసాయం వల్ల మంచి ఆరోగ్యంతో పాటు వ్యవసాయ పెట్టుబడి వ్యయంలో తగ్గుదల, పర్యావరణ సమతుల్యత ఉంటుందని జిల్లా ప్రకృతి వ్యవసాయ కోఆర్డినేటర్ అరుణ కుమారి అన్నారు. శుక్రవారం మండలంలోని గొల్లలకోడేరు గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి సిద్ధంగా తయారు చేసిన ప్రకృతి వ్యవసాయ ఎరువులపై రైతులకు అవగాహన కల్పించారు.


కృష్ణబలిజ కులస్తులకు ఆర్థిక చేయూతనివ్వాలి



కమిషనర్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

భీమవరం: కృష్ణబలిజ కులస్తులకు ఆర్థిక చేయూతనివ్వాలని కృష్ణ బలిజ, పూసల కార్పొరేషన్ చైర్మన్ గంటా త్రిమూర్తులు కోరారు. ఈ మేరకు శుక్రవారం బీసీ కార్పొరేషన్ కమిషనర్ సత్యనారాయణకు వినతిపత్రం అందజేశారు. అనంతరం భీమవరంలో త్రిమూర్తులు విలేకర్లతో మాట్లాడుతూ కృష్ణబలిజ, పూసల కులస్తుల స్థితిగతులను కమిషనర్‌కు వివరించి వారికి రావాల్సిన కార్పొరేషన్ నిధులపై చర్చించామని తెలిపారు.

ఇంటి పన్ను రీ-సర్వేతో రూ.8 లక్షల ఆదాయం



రీ-సర్వే చేస్తున్న సర్వేయర్లు

ఆకివీడు: నగర పంచాయతీ పరిధిలో నూతన భవన నిర్మాణాలు, పాత ఇళ్ల మార్పులు, చేర్పులు, వ్యాపార రీత్యా మార్చిన భవనాలున్న ప్రాంతాల్లో రీ-సర్వే చేస్తున్నట్లు నగర పంచాయతీ మేనేజర్ వెంకటేశ్వరరావు, రెవిన్యూ కం శానిటరీ ఇన్స్పెక్టర్ సాకేత్ చెప్పారు. స్థానిక టెలిఫోన్ క్వార్టర్స్ సమీపంలో శుక్రవారం భవన విస్తీర్ణాన్ని కొలిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత కొద్ది రోజులుగా చేసిన రీ-సర్వే వల్ల నగర పంచాయతీకి రూ. 8 లక్షల పైబడి ఆదాయం వచ్చిందన్నారు. ఇంటి పన్ను తక్కువగా వస్తున్న ఇళ్లను కూడా రీ-సర్వే చేస్తామని తెలిపారు. ప్రస్తుతం నగర పంచాయతీలో 8,119 గృహాలున్నాయన్నారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

భీమవరం: తెలుగు భాషా దినోత్సవం, గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని శుక్రవారం భీమవరంలోని పలు విద్యాసంస్థల్లో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఝాన్సీలక్ష్మీభాయి మునిసిపల్ పాఠశాలలో రచయిత తెన్నేటి మాస్టారు మాట్లాడుతూ తెలుగుభాష గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో కలిగొట్ల గోపాలశర్మ, స్కూల్ హెచ్ఎం కె కృష్ణకుమారి, ఎస్ఎస్ఎన్ రాజు, కాకుమాను శ్రీనివాసరావు, చింతలపాటి రామకృష్ణంరాజు, కృష్ణమోహన్ పాల్గొన్నారు.

–ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ కళాశాలలో..

అవకాశాలు అందిపుచ్చుకునే తరుణంలో వెనుకబడకుండా ఉండాలంటే మాతృభాష, క్రీడా నైపుణ్యాలను అభివృద్ధి పర్చుకోవాలని ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి మల్లుల సీతారామ్‌ప్రసాద్, కళారంజని అధ్యక్షుడు జవ్వాది దాశరథి శ్రీనివాస్ అన్నారు. స్థానిక ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు భాషా, జాతీయ క్రీడా దినోత్సవ వేడుకల్లో పాల్గొని మాట్లాడారు. భాషా సాహిత్యాల ద్వారా సామాజిక చైతన్యానికి పాటుపడుతూ క్రీడల్లోఉత్సాహంగా పాల్గొనడం ద్వారా శారీరక దారుఢ్యాన్ని సాధించి యువత మేధోపరమైన శక్తిమంతమైన సమాజాన్ని నిర్మించాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ పి అరవిందస్వామి మాట్లాడుతూ గ్రాంథిక భాషకు చరమగీతాన్ని పాడి సామాన్య ప్రజలు మాట్లాడుకునే వ్యావహారిక భాషకు పట్టం కట్టిన గిడుగు రామ్మూర్తి పంతులు చిరస్మరణీయుడన్నారు. అనంతరం



భీమవరం: ఝాన్సీలక్ష్మీభాయి మునిసిపల్ స్కూల్లో తెలుగుభాషా దినోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు కాకుమాని శ్రీనివాసరావు, ఎస్ లక్ష్మీకాంతం, జి ఉమామహేశ్వరి, ఎల్ నర్సింహారావు, డివివిసిహెచ్ సత్యనారాయణ, జి ప్రసాద్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అమ్మ కంటే తెలుగు భాష మధురమైనది

భీమవరం అర్బన్: అమ్మ కంటే తెలుగు భాష మధురమైనదని ప్రధానోపాధ్యాయులు ఎస్ శ్రీ సూర్య భగవాన్‌రాజు అన్నారు. భీమవరం మండలంలోని అనాకోడేరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు సూర్య భగవాన్ రాజు మాట్లాడుతూ చిన్నప్పటి నుంచి విద్యార్థులు తెలుగు భాషపై పట్టు సాధించాలన్నారు. తద్వారా అన్ని రంగాల్లోను ఉన్నత స్థితిని సాధించడానికి అవకాశం ఉంటుందన్నారు. తెలుగు ఉపాధ్యాయులు ఎస్. శారద,సంధి ప్రేమరాజు లు మాట్లాడుతూ విద్యార్థులకు తెలుగు భాష ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం తెలుగులో వ్యాస రూప పోటీలు నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తెలుగు భాష ఉపాధ్యాయులు ఎస్ శారద, సంధి ప్రేమరాజులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రేపాక వెంకన్నబాబు, బి. వనజ, బి రాధామణి, ఎంవీ శ్రీలక్ష్మి, బి జ్యోత్స్న, కె. రాజేష్ కుమార్‌రాజు, జీఎస్ విజయలక్ష్మి, సీహెచ్ శ్రీనివాస్, కె.గిరిజ, రమాదేవి, సీమెచ్ జలాబాయి, వై. శకుంతల, ఎం బాల పల్లాలరాజు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆకివీడులో..

ఆకివీడు: తెలుగు భాషను వ్యవహారిక, వాడుక భాషగా అభివృద్ధి చేసి తెలుగు ప్రజలకు అందించిన మహోన్నతుడు, భాషా శాస్త్రవేత్త స్వర్గీయ గిడుగు వెంకటరామ్మూర్తి అని ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సుజాత కొనియాడారు. మండలంలోని దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రామ్మూర్తి జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె తెలుగు భాషా ఔన్నత్యాన్ని విద్యార్థులకు వివరించారు. అనంతరం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో ప్రహర్ష, వక్తృత్వ పోటీల్లో కె.మీనాక్షి మొదటి బహుమతులు గెలుచుకున్నారు.

పాలకోడరులో..

పాలకోడేరు: జాతీయ తెలుగు భాషా దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాలను మండలంలోని వేంద్ర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధాన ఉపాధ్యాయులు జీవీవీ శ్రీనివాస్ అధ్యక్షతన శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు తెలుగు భాషపై అవగాహ కల్పించారు. అనంతరం మేజర్ ధ్యాన్ చంద్ సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయులు ఎం.విశ్వనాథరాజు, పంపన సాయిబాబు, జి.సుభోసుబాబు పాల్గొన్నారు.



భీమవరం అర్బన్ అనాకోడేరులో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం



ఆకివీడు: వీవీ గిరి కళాశాలలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కె.సుజాత



పాలకోడేరు: విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

వినాయక నిమజ్జనాలు ప్రారంభం



కాళ్ల లంకలో వినాయకుడిని నిమజ్జనానికి తరలిస్తున్న భక్తులు

కాళ్ల: గణనాథుని నిమజ్జన కార్యక్రమాలు మూడో రోజు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కాళ్ల లంక రోడ్డులోని కాలనీలో ఏర్పాటు చేసిన గణనాథుని నిమజ్జన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. తొలుత స్వామివారి మండపం వద్ద భారీ అఖండ అన్నసమారాధన నిర్వహించారు. స్థానికులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం నిమజ్జన కార్యక్రమం నిర్వహించారు.

వినాయకుడికి ప్రత్యేక పూజలు

ఉండి: వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకుని మూడో రోజు బొజ్జ గణపయ్య విశేష పూజలందుకున్నాడు. ఉండి కొత్తపేటలో శుక్రవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా చవితి సందడి నెలకొని ఉంది.

విజయ గణపతికి సారె సమర్పణ



విజయగణపతి సారె అందజేసిన దృశ్యం

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం మెంటేవారి తోటలోని విజయగణపతి స్వామివారికి గణపతి నవరాత్రి మహోత్సవంలో భాగంగా శుక్రవారం భక్తులు సారె అందజేశారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు కొమ్ము శ్రీనివాస్ స్వామివారికి అభిషేకం, హోమాలు, గరిక పూజ నిర్వహించారు. అనంతరం బండారు గంగాధర్ స్వామి, లావణ్య దంపతులు, కనిశెట్టి జ్ఞానసాయి, సాయినేత్రి దంపతులచే స్వామివారికి సారె అందించారు.

ఆటో డ్రైవర్లతో సర్కార్ ఆటలు

- ఎన్నికల హామీని అమలు చేయని వైనం
- రూ.15వేలు సాయం ఎక్కడ?

భీమవరం(ప్రకాశం చౌక్): అధికారం కోసం బూటకపు హామీలు ఇవ్వడం ముఖ్యమంత్రి చంద్రబాబుకు అలవాటేనని ఆటో డ్రైవర్లు విమర్శిస్తున్నారు. ఏడాది క్రితం జరిగిన సమయంలో అన్ని వర్గాల ప్రజలుమాదిరిగానే తాము మోసపోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి అధికారంలోకి వస్తే సూపర్ సిక్స్ పథకాలతో పాటు ఆటో, ట్యాక్సీ లైసెన్స్ కలిగిన లారీ, టిప్పర్ డ్రైవర్లకు ఏటా రూ.15వేలు ఆర్థిక సహాయం అందిస్తామని, సంక్షేమ బోర్డు ఏర్పాటు చేస్తామని, ప్రమాద, ఆరోగ్య బీమా కల్పిస్తామని మేనిఫెస్టోలో పేర్కొంది. ఎన్నికల సమయంలో కూటమి నేతలు దీనిపై విస్తృతంగా ప్రచారం చేశారు. అయితే కూటమి సర్కార్అధికారంలోకి వచ్చి ఏడాది దాటినా ఈ హామీ అమలుకు నోచుకోలేదు. ఆటో డ్రైవర్లతో కూటమి సర్కారు ఆటలు మానుకొని ఇచ్చిన మాట ప్రకారం కనీసం ఆర్థిక సాయంమైనా అందించాలని డిమాండ్ చేస్తున్నారు. భీమవరం నియోజకవర్గంలో 2వేల మంది కార్మికులు ఆటోలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. బస్సులు లేనప్పుడు ప్రయాణికులు ఆటోలపై ఆధారపడి గమ్యస్థానాలకు చేరుకుంటారు.



భీమవరంలో ధర్నా నిర్వహిస్తున్న ఆటో డ్రైవర్లు (ఫైల్)

తగ్గిన ఆదాయం..పెరిగిన ఖర్చులు..

ఆటో నిర్వహణకు సాధారణంగా ఖర్చులు ఉంటాయి. ప్రస్తుతం పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలతో ఆటో డ్రైవర్లు రోజంతా కష్టపడినా కనీసం రూ.200నుంచి రూ.300కూడా మిగలిని పరిస్థితి. దీనికితోడు కూటమి ప్రభుత్వం ఫ్రీ బస్సు ఏర్పాటు చేయడంతో మహిళలు ఎవ్వరూ ఆటోలో ప్రయాణించడం లేదని వాపోతున్నారు.

వైఎస్సార్ సీపీ హయాంలో...

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ఏటా బడ్జెట్ కేటాయించేది. అర్హులైన ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు ఏడాదికి రూ.10వేలు వారి ఖాతాల్లో జమచేసేది. దీంతో పాటు వాహన డ్రైవర్ ప్రమాదవశాత్తు మృతి చెందితే వారి కుటుంబ సభ్యులకు రూ.10 లక్షల బీమా అందించేవారు. అలాగే రవాణా వాహనం కొనుగోలుకు బ్యాంకు నుంచి రుణాలు తీసుకునే డ్రైవర్‌కు రూ.3లక్షల వరకు వడ్డీ రాయితీ అందించి భరోసా కల్పించారు. దీంతో డ్రైవర్లు తమ కుటుంబసభ్యులకు ఇబ్బంది లేకుండా దర్జాగా ఉండేవారు. ప్రస్తుతం కూటమి సర్కార్ హయాంలో ఎలాంటి భరోసా లేకపోవడం గమనార్హం.

భారమైన కుటుంబ పోషణ



కూటమి ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయంతో కుటుంబ పోషణ భారంగా మారింది. ప్రత్యామ్నాయ ఉపాధి చూపకుండా ఉచిత బస్సు పథకం అమలు చేయడంతో ఆటో కార్మికుల కుటుంబాలు రోడ్డుపడ్డాయి. ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే రిలే దీక్షలు చేపడతాం.

– ఇంటి సత్యనారాయణ, భీమవరం ఆటో యూనియన్ అధ్యక్షుడు

రూ.15 వేలు వెంటనే అందించాలి



రోజంతా కష్టపడి ఆటో నడిపినా కుటుంబ పోషణ కష్టంగా మారింది. నిత్యావసర సరుకులతో పాటు ఇంధన ధరలు పెరిగిపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికల హామీ మేరకు ప్రభుత్వం ఆటో కార్మికులకు రూ.15వేలు సాయం అందించాలి.

– పి.గోపి ఆటోడ్రైవరు భీమవరం

అన్ని రంగాల్లో స్థిరత్వ సాధనకు కృషిచేయాలి

భీమవరం: వ్యవసాయం, ఆరోగ్యంతోపాటు తాగు, సాగునీరు అన్నింటా స్థిరత్వాన్ని సాధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐఐటి చెన్నై సివిల్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్ వేణురాజు అన్నారు. భీమవరం ఎస్ఆర్‌కేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో పాండ్ పాలసీ వాటర్ టాక్స్ ఫీల్డ్ ఇన్సైట్స్ అండ్ సస్టైనబుల్ సొల్యూషన్స్ అనే అంశంపై మూడు రోజులు నిర్వహించే కార్యక్రమాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. దేశానికి మేధావుల కంట్రిబ్యూషన్ అవసరం ఎంతో ఉందన్నారు. కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ సాగి రామకృష్ణ నిశాంత్ వర్మ, కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు మాట్లాడుతూ సివిల్ ఇంజనీరింగ్ పూర్వ విద్యార్థులు1996–2000 బ్యాచ్ విద్యార్థులు స్మార్ట్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ల్యాబ్ ఏర్పాటుకు రూ. రెండు లక్షలు విరాళం అందజేయగా ల్యాబ్‌ను వేణురాజు చేతుల మీదుగా ప్రారంభించడం శుభ పరిణామన్నారు. అనంతరం సస్టైనబుల్ సొల్యూషన్స్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ కెవి మురళీకృష్ణంరాజు, టి వంశీ నాగరాజు పాల్గొన్నారు.



భీమవరం ఎస్ఆర్‌కేఆర్ కళాశాలలో పోస్టర్ ఆవిష్కరణ దృశ్యం

వృద్ధుల చట్టంపై అవగాహన

ఆకివీడు: వృద్ధుల చట్టాన్ని ప్రతి ఒక్క వృద్ధుడూ తెలుసుకుని తనను తాను రక్షించుకోవాలని నగర పంచాయతీ వైస్‌చైర్మన్ పుప్పాల పండు, కౌన్సిలర్ గేదల అప్పారావు పిలుపునిచ్చారు. సర్ ఆర్థర్ కాటన్ వృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకుడు అట్లూరి రంగారావు నివాసం వద్ద శుక్రవారం వృద్ధుల చట్టంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృద్ధులను అనాథాశ్రమాల్లో వదిలివేయడం, రోడ్లపైన, ఇతర ప్రదేశాల్లో వదిలివెళ్లేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. వృద్ధులను చూసుకోవలసిన బాధ్యత పిల్లలపై ఉందన్నారు. సంఘ అధ్యక్షులు బంగారయ్య మాట్లాడుతూ గత 13 ఏళ్లుగా వృద్ధుల సంఘం దాతల సహకారంతో పలు సేవా కార్యక్రమాల్ని చేపట్టిందన్నారు. కార్యక్రమంలో రంగారావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు గుండా సుందరరామనాయుడు, వీజే కోటేశ్వరరావు బాబు, మన్నే పోతరాజు, మోరా జ్యోతి, యర్రా కేశవరావు, కౌనిసలర్ గోపిశెట్టి సత్యవతి, సత్యనారాయణ, సంఘ ఉపాధ్యక్షుడు నేరెళ్ల ఆదినారాయణ, ఎస్.కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భీమవరం: భవన నిర్మాణ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం వచ్చేనెల 15వ తేదిన విజయవాడలోని లేబర్ కమిషనర్ కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయాలని భవననిర్మాణ కార్మికుల సంక్షేమ సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు చింతలకాయల బాబూరావు పిలుపునిచ్చారు. శుక్రవారం భీమవరంపట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన భవననిర్మాణ కార్మికుల జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. 1214 మెమో రద్దు చేయాలని, సంక్షేమ బోర్డు నుంచి రావల్సిన నిధులను వెంటనే జమ చేయాలని, సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు నంగేటి కొండ, మండా సూరిబాబు, ఉపాధ్యక్షుడు డి ప్రసాద్, నూకల సత్తిబాబు, కేశిరెడ్డి ధనరాజు పొట్టిపోతుల మధుసూదనరావు, వీరవల్లి మాధవ, గూడూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

భీమవరం: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని యువత విద్యతోపాటు క్రీడల పట్ల ఆసక్తి కనబర్చాలని లండన్ డిప్యూటీ మేయర్ ఆరేటి ఆర్యన్ ఉదయ్ అన్నారు. భీమవరంలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో రెండురోజులు నిర్వహించిన క్రీడా దినోత్సవం ముగింపు కార్యక్రమాన్ని శుక్రవారం డీఎన్నార్ కళాశాల గన్నాబత్తుల క్రీడా మైదానంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయ్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రీడలు, వ్యాయామం, యోగా ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. భారత క్రీడా రంగం ప్రగతిపథంలో ఉందంటే క్రీడాకారులు చేస్తున్న కృషేనన్నారు. కార్యక్రమ నిర్వాహకుడు చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ధ్యాన్ చంద్ మిలట్రీలో మేజర్‌గా పనిచేస్తూ హాకీ పట్ల ఆసక్తితో హాకీ క్రీడలోనికి ప్రవేశించి భారతదేశానికే హాకీ పితామహుడిగా పేరుపొందారన్నారు.



క్రీడాకారులకు బహుమతులు అందచేస్తున్న దృశ్యం

అనంతరం పలు విభాగాల్లో నిర్వహించిన క్రీడ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఫిజికల్ డైరెక్టర్ నర్సింహరాజు, పీఈటిలు కేసీహెచ్ శేఖర్‌రాజు, రామభద్రిరాజు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు బొండా రాంబాబు, భట్టిప్రోలు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్‌కేఆర్‌లో క్రికెట్ అకాడమీ ఏర్పాటు

భీమవరం: భీమవరం ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కళాశాల ఆవరణలో క్రికెట్ అకాడమీ ఏర్పాటు చేసి క్రికెట్ టీమ్స్ తయారయ్యే విధంగా విద్యార్థులను ప్రోత్సహిస్తామని కళాశాల సెక్రటరీ అండ్ కరెస్పాండెంట్ సాగి రామకృష్ణ నిషాంతవర్మ చెప్పారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శుక్రవారం కళాశాల ప్రాంగణంలో క్రీడాకారులతో జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడా స్ఫూర్తికి ధ్యానచంద్‌ను ఆదర్శంగా తీసుకొని యువత క్రీడాకారులుగా ఎదగాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన షటిల్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎం జగపతిరాజు, ప్రిన్సిపల్ కెవి మురళీకృష్ణంరాజు, ఫిజికల్ డైరెక్టర్ పి సత్యనారాయణరాజు తదితరులు పాల్గొన్నారు.

పంట కాలువ గట్లను ఆక్రమించిన వారిపై చర్యలు

కాళ్ల: పంటకాలువ గట్లను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఏపీ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణంరాజు అన్నారు. మండలంలోని జక్కరం గ్రామం వద్ద శుక్రవారం ఉదయం బొండాడ పంట కాలువ ప్రక్షాళన పనులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలువకు ఇరువైపులా భూస్వాములు గట్లను ఆక్రమించడంతో కాలువను తవ్వడానికి వీలులేక పూర్తిగా పాడైపోయిందన్నారు. సుమారు 23 కిలోమీటర్ల పొడవునా మాలవానితిప్ప గ్రామం వరకు 19 అడుగులు వెడల్పు ఉండేవిధంగా కాలువను ప్రక్షాళన పనులు చేపట్టినట్లు ఆయన స్పష్టం చేశారు.

క్రీడారంగంలో మహిళలు ముందుకు రావాలి

ఉండి: క్రీడారంగంలో మహిళలు మరింత ముందుకు రావాలని జాతీయ వాలీబాల్ మాజీ ప్లేయర్, జిల్లా గర్ల్స్ వాలీబాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షురాలు గాదిరాజు లోహిత అన్నారు. శుక్రవారం హాకీ పితామహుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా 29వ జాతీయ క్రీడాదినోత్సవాన్ని పురస్కరించుకుని మహదేవపట్నం జెడ్పీ హైస్కూల్‌లో లోహితను సత్కరించారు. కార్యక్రమంలో హెచ్ఎం జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

భీమవరం: చదువుకునే వయస్సులో చదువు మీద మాత్రమే ఏకాగ్రత కలిగి ఉండాలని ఇతరాత్ర ఆకర్షణలకు లోనైతే లక్ష్యాన్ని చేరుకోలేరని భీమవరం రెండవ అదనపు జ్యుడిషియల్ మొదటి తరగతి మేజిస్ట్రేట్ ఎస్ జ్యోతి అన్నారు. భీమవరం ఆదిత్య జూనియర్ కాలేజీలో శుక్రవారం నిర్వహించిన బాల్య వివాహాలపై అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాలు చేసుకుంటే అనారోగ్య సమస్యలు వస్తాయని బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. ఈ కార్యక్రమంలో టుటౌన్ సీఐ జి కాళీచరణ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యేలేటి యోహాన్, ప్యానల్ న్యాయవాదులు బి సురేష్ కుమార్, పి అంబేద్కర్, మీడియేషన్ న్యాయవాది కె విజయలక్ష్మి, ఐసీడీఎస్ సీడీపీఏ లక్ష్మీకాంతమ్మ, పీహెచ్‌సీ డాక్టర్ చాందిని, ఎస్టీ హాస్టల్ వార్డన్ డి శ్రీనివాస్, కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపల్ ఆర్.మధురాజు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జడ్జి జ్యోతి

రక్తదానం మహాదానం

భీమవరం అర్బన్: రక్తదానం మహాదానమని ఆపదలో ఉన్న వారికి ప్రాణదాత అని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ కేసీహెచ్ అప్పారావు అన్నారు. భీమవరం మండలంలోని రాయలం గ్రామంలో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ భవనంలో రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షురాలు, జిల్లా కలెక్టర్ సీహెచ్ నాగరాణి ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా నీటి నిర్వహణ సంస్థ (డ్వామా) ఆధ్వర్యంలో ఉద్యోగులు రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా డ్వామా పీడీ కేసీహెచ్ అప్పారావు మాట్లాడుతూ ప్రమాదాల్లో గాయపడిన వారికి, గర్భిణులకు శస్త్ర చికిత్సలు చేయించుకున్న వారికి ఎంతో అవసరమైన రక్తం కొన్ని సందర్భాల్లో దొరకదని అటువంటి వారికి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు విధులకు పరిమితం కాకుండా సామాజిక మానవతా కార్యక్రమాలలో భాగంగా రక్తదానం చేయడం ద్వారా ఇతరులకు ఆదర్శంగా నిలిచారన్నారు. ఈ శిబిరం ద్వారా 100 యూనిట్లు రక్తం సేకరించామన్నారు. అనంతరం రక్తదానం చేసిన వారికి ప్రశంసా పత్రాలను అందజేశారు.